ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర

## కోడవల్లిలో శ్రీనాన్నగారి ప్రవచనము, 21-6-95

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మన హృదయంలో ఒక సద్వస్తువు ఉంది. అది మనకు అనుభవంలోనికి రాకుండా ఇతరులు అడ్డురావటంలేదు. నేను అనే తలంపే అడ్డువస్తోంది అని ప్రాథమికంగా మనకు తెలియాలి. నేను అనే తలంపు నీకు బాహ్యం నుండి రావటంలేదు. లోపల నుండే వస్తోంది. అది లోపల నుండే వస్తోంది అని మనకు తెలుస్తోంది గాని దాని పుట్టుస్థానం మనకు తెలియటం లేదు. అది తెలిసే వరకూ నీవు ఉపనిషత్‌లు పారాయణచేసినా, భగవద్గీత పారాయణ చేసినా జ్ఞానమురాదు.

పుస్తకాలు చదవటం వలన పాండిత్యము వస్తుంది. దానిని ఎంతవరకూ ఉపయోగించుకోవాలో అంతవరకూ ఉపయోగించుకోవాలి. అతిగా వెళితే అన్వేషణ వదలివేస్తాము. శబ్దం యొక్క అర్థం తెలియాలి. అర్థం తెలియకుండా పారాయణచేయటం వలన ఉపయోగం ఉండదు. శబ్దం వెనుక ఉన్న స్పిరిట్‌ను పట్టుకోవాలి. శబ్దం యొక్కలోతులు అవగాహన అయితే గాని మనకు జ్ఞానంరాదు. శాస్త్రములు అన్నీ బయట ఉన్నాయి. సద్వస్తువు మన హృదయంలో ఉంది. లోపల మానివేసి బయట ప్రకృతిలో వెదకటం వలన జ్ఞానం రాదు.

(మన అందరికి తండ్రి పరమేశ్వరుడు. ఆచార్యుల వారి దగ్గరకు ఒకరు వచ్చి దేవుడు లేడు అని చెపుతారు. అప్పుడు ఆచార్యుల వారు ఆయనతో మీ తండ్రి ఎవరు అని అడిగితే చెపుతారు. ఆయనకు తండ్రి ఎవరు అంటే చెపుతారు. ఆయనకు తండ్రి ఎవరు అంటే నాకు తెలియదు అంటారు. నీకు తెలియదు కాబట్టి లేదు అంటావా అని ఆచార్యులవారు అడిగారు. మనకు తెలియనంత మాత్రముచేత ముగింపునకు రాకూడదు. తెలుసుకోవటానికి ప్రయత్నం చేయాలి. అన్వేషణ చేయాలి.) మొదట ప్రాణముగా వ్యక్తమయినవాడు పరమేశ్వరుడే. అందువలన మనకు తండ్రి పరమేశ్వరుడు. తెలియనిది తెలుసుకోవటానికి ప్రయత్నం చేయాలి అంతేగాని ఏమీలేదు అని అనుకోకూడదు.

సృష్టికి ఆధారముగా ఉన్న వస్తువు నీవే. బ్రహ్మము నీవే అని వేదములలో చెప్పారు. ఇవి ప్రమాణవాక్యములు. ఋషులు దర్శించి చెప్పినవి. అంతేగాని ఊహించి చెప్పిన వాక్యములు కావు. అనుభవంలో లేకుండా చెప్పిన వాక్యములు అయితే కాలప్రవాహములో కొట్టుకొనిపోతాయి. ఏదో మంచి పనిచేస్తారు. పుణ్యం వస్తుంది. కాల ప్రవాహములో దానిని అనుభవిస్తారు. అదిపోతుంది. కాని జ్ఞాన మార్గము

అటువంటిదికాదు. ఇది అర్థమయినపుడు, ఇది నీకు అనుభవంలోనికి వచ్చినపుడు ఇప్పుడే ఇక్కడే నీకు శాంతి అందుతుంది. బాహ్యంగా నీ ప్రారబ్ధ కర్మ ఎలా ఉన్నా నీకు సుఖము, శాంతి అందుతూ ఉంటుంది. దేహము నేను అని అనదు. సద్వస్తువు నేను అని అనదు. మధ్యలో వచ్చినటువంటి ఈ నేను ఎవడు అని విచారణ చేస్తే వస్తువు ఇప్పుడే ఇక్కడే అనుభవం లోనికి వస్తుంది. అప్పుడు విశ్వాసములతోటి, నమ్మకాలతోటి పనిలేదు. మనం పూజ చేస్తున్నాము. జపం చేస్తున్నాము. ధ్యానం చేస్తున్నాము. పూజ చేసినపుడు, జపం చేసినపుడు, ధ్యానం చేసినపుడు కూడా అక్కడ నేను ఉన్నాడు, దేవుడూ ఉన్నాడు. వీటివలన నీకు పుణ్యం రావచ్చును, మనస్సుకు కొంత కుదురు రావచ్చును. ఎవడైతే పూజ చేస్తున్నాడో, ఎవడైతేజపంచేస్తున్నాడో, ఎవడైతేధ్యానంచేస్తున్నాడో వాడి సమస్య పరిష్కారం చేసుకోకపోతేజ్ఞానంరాదు. ఇందులో రాజీ ప్రసక్తిలేదు. ధ్యానం వలన నేను నశిస్తే మంచిదే. నేను నశించకపోతే జ్ఞానం కలుగదు

రాగద్వేషములు మనకు ఎంత అపకారము చేస్తున్నాయో మనకు తెలియటంలేదు. రాగద్వేషములవలన శక్తి నష్టమవుతుంది. రాగద్వేషములవలన మనోకల్పితములు అన్నీ నిజంలాగ మనకు కనబడుతున్నాయి.

అబద్ధమైన నేను ఎప్పుడైతే అణిగిపోయిందో లోపల ఉన్న సత్యవస్తువే నీకు నేనుగా అనుభవంలోనికి వస్తుంది. అది దేహమునకు, కాలమునకు అతీతమైనది కాబట్టి నేను దేహమునకు, కాలమునకు అతీతముగా ఉన్నాను అని నీకు తెలుస్తూ ఉంటుంది. అది అంతటా ఉంది కాబట్టి నేను అంతటా ఉన్నాను అని నీకు తెలుస్తూ ఉంటుంది.

మేము ప్రయత్నం చేస్తున్నాము. వస్తువుగురించి తెలియటంలేదు అని చాలామంది చెపుతూ ఉంటారు. మనం ప్రయత్నం చేస్తాము. అది మెకానికల్‌గా చేస్తాము ప్రేమగా చెయ్యటంలేదు. ప్రీతిగా చెయ్యటం లేదు. అందువలన వస్తువు గురించి మనకు తెలియటంలేదు. వస్తువు లేనందువలన మనకు తెలియటంలేదు అని అనుకోవద్దు. మన ప్రయత్నంలో ప్రేమలేనందువలన, ప్రీతి లేనందువలన దాని గురించి మనకు తెలియటంలేదు.

నేను గురించి తెలియటంలేదు అని భగవాన్‌తో అంటే అదినీవే కనిపెట్టాలి అంటున్నారు భగవాన్. దానికి నీవు ప్రయత్నం చేయాలి వస్తువును తెలుసుకోవాలి అని ప్రయత్నం ఎప్పుడైతే ప్రారంభించావో దాని కూడా గురువు అనుగ్రహము వస్తుంది. నీవు చేయగలిగినది చెయ్యి. అప్పుడు గురువు అనుగ్రహము వస్తుంది అంటున్నారు భగవాన్.

శివుడు కంటే విష్ణువు గొప్ప, విష్ణువు కంటే శివుడు గొప్ప అని ఇలా మతపిచ్చిలో ఉన్న వాళ్ళు మాయలో ఉన్నట్లు గుర్తు. బ్రహ్మానుభవం లేక ఇలా చెపుతున్నారు. విషయం సరిగా అర్థం కాక ఇలా చెపుతున్నారు.

యజ్ఞాలు చేయమని, యాగాలు చేయమనిచెప్పటం. దేవతలు వచ్చి అనుగ్రహిస్తారు అని చెప్పటం. ఇటువంటి విషయాలతో ఎక్కడికి తీసుకొని పోతున్నారో చెప్పేవాడికే తెలియటంలేదు. నిన్ను అనుగ్రహించే వాడు నీలోపలే ఉన్నాడు.

మనకు దేహభావన ఉంది. మొదట అహంభావన వచ్చాక దేహభావన వస్తుంది. అహంభావన రాక ముందు దేహ భావనలేదు. అహంభావన లేకుండా పనిచేయటమే తపస్సు. నీవు చేసేపని, మాట్లాడే మాట అహంభావన తగ్గేటట్లు ఉండాలి. అహంభావన నశించేటట్లు జీవించటమే మహాతపస్సు.

దేహము పుట్టినపుడు నీవు పుట్టలేదు. అహంభావన పుట్టినపుడు నీవు పుట్టావు. అహంభావన నశించటమే నిజమైన మరణము. అప్పుడు అమృత స్థితిని పొందుతావు. దేహము పుట్టుక, దేహము మరణము అప్రధానము. బాహ్యాపరిస్థితులు అన్నీ అప్రధానమైనవి. అహంభావనను వదిలించుకోవాలి. ఇది ప్రధానమైనది. అహంభావన లేకుండా పనిచేస్తే కొత్త వాసనలు పుట్టవు. పునర్జన్మకు కారణమైన హేతువులు నశిస్తాయి.

ఈ దేహములో ప్రాణమును ఎంత ఎక్కువకాలము నిలబెట్టుకుందాము అని ప్రయత్నం చేయటం తప్ప మనకు వేరే పని ఏమీలేదు. అహంభావన తొలగించుకోవటానికి మనం ఏమీ ప్రయత్నం చేయటంలేదు. అందువలన నీలోపలే సద్వస్తువు ఉన్నా అదినీకు అనుభవంలోనికి రావటంలేదు. అహంభావన నుండి విడుదల పొందటానికి నీవు ప్రయత్నం ప్రారంభిస్తే గురువు అనుగ్రహము అందుతుంది.

(అహంభావనను పోగొట్టుకోమని చెపుతున్నారు దానికి పద్ధతి చెప్పమని భగవాన్‌ను అడిగితే ఉన్నదానిని పట్టుకుంటే లేనిది పోతుంది అన్నారు భగవాన్ దేహం నుండి విడుదల పొందటానికి సాధన అవసరములేదు అహంభావన నుండి విడుదలపొందటానికి సాధన అవసరము. అది నిజంకాదు కాబట్టి సాధన చేయటం వలన దాని నుండి విడుదల పొందుతావు. ఏదైతే నిజమో దానిని పట్టుకుంటే నిజం కానిదానిలో నుండి విడుదల పొందుతావు.) (B)

మనం చెప్పినది అర్థంకాకపోతే అది అబద్ధం అనుకొంటారు. చైతన్య స్థాయిలో తేడా ఉండటం వలన ఇలాజరుగుతుంది. వారు ఏమి చెపితే అది మనం వినాలి ఇలా కొంతమంది ఉంటారు. వారు చెప్పేదానిలో నిజం ఉండదు. రీజన్ ఉండదు. అయినా వారు చెప్పినది మనం వినాలి. అటువంటి స్నేహాలు మీకు ఉంటే వెంటనే వదలించుకోవటం మంచిది.

మనం పని చేస్తున్నా చేయనిస్థితికి ఎదగాలి. చేసిమర్చిపోవాలి. అంతేగాని అదే మనస్సులో మోస్తూ ఉంటే కొత్త వాసనలు వస్తాయి. విషయమును అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాము అర్థం కావటం లేదు అని భగవాన్‌ను అడిగితే విషయమును అర్థం చేసుకోవాలనే ప్రయత్నం నిజమైతే తప్పక వస్తువు నీకు తెలుస్తుంది. ప్రయత్నంలో దోషం లేకుండా ఉంటే, విషయమును అర్థం చేసుకోవాలనే కుతూహలం నీకు ఉంటే ఎటువంటి బుద్ధిని ఇస్తే విషయం అర్థ మవుతుందో అటువంటి బుద్దిని ప్రసాదిస్తాను అని కృష్ణుడు చెప్పాడు.

మీరు చెప్పిన మాటలు అర్థం కావటంలేదు. అలాగని నేను భక్తుడను కాను అని అనుకోవద్దు. నేను జపంచేస్తున్నాను. నేను చేసే జపం వలన వస్తువు తెలుస్తుందాలేక మీరు చెప్పే మాటలనే పట్టుకోవాలా.

నాకు మార్గమును చూపండి అని భగవాన్‌ను అడిగారు జపం అనేది నిజంకాదు ఇది అసహజమైనది. నీ హృదయంలో ఒక సత్యవస్తువు ఉంది. అది సహజమైనది. నీవు చేసే జపం, ధ్యానం సహజమైనవికావు. జపం, ధ్యానం చేసుకోవద్దు అని భగవాన్ చెప్పటంలేదు. నీ హృదయంలో ఉన్న సహజమైన వస్తువును వదలిపెట్టి అసహజమైన జపాలతోటి, ధ్యానాలతోటి నీకు పని ఏముంది. సత్యమైన వస్తువు గురించి నీకు తెలిసినపుడు ధ్యానం సహజముగానే సాగుతుంది. ధ్యానం చేసుకోవటానికి కూర్చోవటం, టైముకోసం చూడటం. ధ్యానం సహజమైనది అయితే టైము గొడవ ఎందుకు? టైము ఎప్పుడు అవుతుంది అని చూసుకొంటూ ఉంటాము. మీరే పరిశీలించుకోండి తెలుస్తుంది.

(ఒక స్వామి భగవాన్ దగ్గరకు వచ్చి నాకు కృష్ణుడు కనిపిస్తున్నాడు అని చెప్పారట ఎంతసేపు ఉంటున్నాడు అని భగవాన్ అడిగారట. కొంతసేపు కనబడుతున్నాడు, వెళ్ళిపోతున్నాడు అని ఆ స్వామి చెప్పాడట ఇలా కొంత సేపు కనబడి వెళ్ళిపోయే దేవుడు కావాలా లేక నిరంతరము నిన్ను పట్టుకొని ఉండే దేవుడు కావాలా అని భగవాన్ అడిగారు. అంతవరకు అదే నిజమైన స్థితి, చివరి స్థితి అనుకొనేవాడిని భగవాన్ ఈ ప్రశ్న అడిగాక నాలో పరిశీలన మొదలయింది అని ఆస్వామి చెప్పారు.)

ఇతరులను నీవు ఎవడవు అని ఎలా అడుగుచున్నావో అలాగ నీమనస్సును నీవు ఎవడవు అని అడుగు. నిరంతరము నీ మనస్సును ఇలా ప్రశ్నించు. అప్పుడు జ్ఞానము కలుగుతుంది.

మీరు పెద్దగా సాధన చేయలేకపోయినా మిథ్యా నేనును అలంకరించుకోవటం తగ్గిస్తే దాని అంతట అదే రాలిపోతుంది.

విషయం సరిగా అర్థమయితే ఆనందము, సుఖము, శాంతి వచ్చి మిమ్మలను వరిస్తాయి. ఆనందము కోసం బయట తిరగనక్కరలేదు. అలౌకికమైన ఆనందము వచ్చి మిమ్మలను వరించినపుడు దేహము ఉన్నా, ఊడిపోయినా ఒకటే. దాని గొడవ మనకు ఉండదు. ఆస్థాయికి ఎదగాలి. మీకు హృదయంలో శాంతి కుదిరినపుడు ప్రపంచ పరిస్థితులు మీకు వ్యతిరేకంగా ఉన్నా మీ శాంతి చెదరదు.

రైలులో ప్రయాణించే వాడు తన పెట్టి రైలుకు బరువు అవుతుందని తన నెత్తిమీద పెట్టుకున్నాడట. మనం చేసేపనులు కూడా ఇలాగే ఉన్నాయి. పెట్టి తన ప్రక్కనున్నా, నెత్తిమీద ఉన్న కూడా మోసేది రైలే. పెట్టి ప్రక్కన ఉంటే తనకు సుఖము. నెత్తిమీద ఆబరువును మోయాలి. అలాగే మనం కర్తృత్వముతో పనిచేసినా జరిగేది ఈశ్వర సంకల్పమే. కర్తృత్వము లేకుండా పనిచేసినా జరిగేది ఈశ్వర సంకల్పమే. కర్తృత్వముతో పనిచేయటంవలన బంధించబడతాము. పనినిన్ను బంధించదు. కర్తృత్వమే నిన్ను బంధిస్తుంది.